సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి, తదితరులు

కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 18: బడుగు, బలహీన వర్గాలు సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, పరిశ్రమల మౌలిక వసతి సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్టమొదటి వీరుడు సర్వాయి పాపన్న అన్నారు. డీఆర్వో పద్మజా రాణి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, గౌడ సంఘం నాయకులు ఆశన్నగౌడ్, రమేశ్‌గౌడ్, నక్క నాగరాజుగౌడ్, ప్రభుగౌడ్, వివిధ సంఘాల నాయకులు కూన వేణు, మాణిక్యం, నగేశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండ బీఆర్ఎస్

చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు, ఆగస్టు 18: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మనూరు జడ్పీటీసీ నివాసంలో మండల పరిధిలోని మాయికోడ్ గ్రామానికి చెందిన పట్లోళ సౌజన్యకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.29,500 చెక్కును కుటుంభ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్య పడవద్దని, నిరంతరం అండగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం మండల పరిధిలోని శల్లిర గ్రామానికి చెందిన శారదకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేందర్‌రావు, సుధాకర్, రాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, మన్నన్, ప్రశాంత్ సాగర్, మహేందర్ గౌడ్, రాజు, ప్రమోద్ గౌడ్ పాల్గొన్నారు.

పంట రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి

న్యాల్‌కల్, ఆగస్టు 18: రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. దరఖాస్తులను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు. నమూనా దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలతోపాటు కుటుంబ సభ్యుల అందరి ఆధార్‌కార్డులు (పేరు సవరణ కోసం ఈ అధార్ కార్డు తప్పనిసరి), కొత్త రేషన్ కార్డు ఆన్‌లైన్‌లో (ఉన్నచో), పట్టాదారు పాసు పుస్తకం, రుణ ఖాతా పుస్తకం, 9 డిసెంబర్ 2023 నాటికి రుణ ఖాతా వివరాల కోసం 1 డిసెంబర్ 2023 నుంచి నేటి వరకు బ్యాంకు స్టేట్‌మెంట్) వివరాలతో కూడిన దరఖాస్తును మండలంలోని ఆయా రైతు వేదికలో ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

మృతదేహం లభ్యం.. కేసు నమోదు

బొల్లారం, ఆగస్టు 18: వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేబీఆర్ కాలనీ సమీపంలోని సిమెంట్ రింగుల వద్ద 35 నుంచి 40 ఏండ్ల మధ్య వయసు గల వ్యక్తి మృతదేహం పడి ఉందని సమాచారం రాగా పోలీసులు వెళ్లి పరిశీలించారు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని భావించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తన ఇంటిపక్క వ్యక్తి హరిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైన్స్ డబ్బులు వాడుకున్నాడని కిడ్నాప్

జిన్నారం, ఆగస్టు 18: జిన్నారం మండలం సోలక్‌పల్లి గ్రామంలోని వజ్ర వైన్స్‌లో క్యాషియర్‌గా పని చేసే మన్నె నరేశ్‌ను వైన్స్ యాజమాన్యం కిడ్నాప్ చేసినట్లు బాధితుని భార్య వీడియో సోషల్ మీడియాలో ఆదివారం హల్‌చల్ చేసింది. దీనిపై పోలీసులు రంగప్రవేశం చేయడంతో కిడ్నాప్‌నకు గురైన నరేశ్ సాయంత్రం జిన్నారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయాన్ని మీడియాకు వివరించారు. ఆయన మాటల్లోనే.. 'సోలక్‌పల్లిలో వజ్ర వైన్స్‌ను శనివారం ఉదయం ఓపెన్ చేసి కౌంటర్‌లో కూర్చుండగా ఇద్దరు అకౌంటెంట్లు వచ్చి లెక్కల్లో తేడా వచ్చిందని తనను బొల్లారం-బాచుపల్లి చౌరస్తాలోని వారి ఆఫీసుకు తీసుకెళ్లారు. తాను రూ.8లక్షలు వాడుకున్నానని, ఇద్దరు అకౌంటెంట్లు కూడా వైన్స్ డబ్బులు వాడుకొని నలభై లక్షలు తక్కువ చూపించి బెదిరించారు. నా నుంచి రూ.పది లక్షలు తీసుకున్నారు. తన బ్యాంకు స్టేట్‌మెంట్, లావాదేవీల వివరాలు, ఫోన్ డాటా పూర్తి వివరాలు వైన్స్ యాజమాన్యానికి ఇచ్చిన. రాత్రంతా వచ్చిన వాళ్లు వచ్చినట్లు కట్టెలు, రాడ్లతో కొట్టారు. నా భార్య, బంధువులు ఫోన్ చేస్తే మాట్లాడించారు.. కానీ ఎక్కుడున్నది చెప్పొద్దని బెదిరించారు. ఆదివారం మధ్యాహ్నం జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ ఫోన్ చేయడంతో తనను సాయంత్రం జిన్నారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తమకు పెద్ద పెద్ద పరిచయాలు ఉన్నాయని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్ర సీఎం చంద్రబాబు నాయుడు ఇద్దరూ బాగా తెలుసని, పోలీసులు కూడా ఏమీ చేయలేరని బెదిరించారు.' అని బాధితుడు మీడియా ముందు వాపోయాడు. బాధితుడు మన్నె నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిష్కరణలు అదుర్స్

- ఐఐటీహెచ్‌లో ఆకట్టుకున్న 'ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్'
- పాల్గొన్న 18 పాఠశాలల విద్యార్థులు
- మూడు ఆవిష్కరణలకు బహుమతుల అందజేత

కందిలోని ఐఐటీహెచ్‌లో ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్ 2024 ఘనంగా జరిగింది. డైరెక్టర్ బీఎస్ మూర్తి ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలోని 18 పాఠశాలలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్‌లో పాల్గొని తమ నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ డిజైనింగ్ విభాగం ప్రొఫెసర్ జాన్ మాథ్యూ ఆవిష్కరణలను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులతో ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్ సందడిగా జరిగింది. ఈ సందర్భంగా బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోని విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించేందుకు ఇన్వెంటర్స్ ఫెయిర్ ఏటా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా వారు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుందని తెలిపారు. ఈ ఫెయిర్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, ఐఐటీహెచ్‌లో జరుగుతున్న పరిశోధనల గురించి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఉత్తమ ఆవిష్కరణలకు బహుమతులు అందజేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థినులు నిహారిక, శివాంగిల ఆవిష్కరణకు మొదటి బహుమతి, రామాంతపూర్‌లోని హెచ్‌పీఎస్ స్కూల్ విద్యార్థులు స్వాతికేష్, లక్ష్య ఆవిష్కరణకు ద్వితీయ బహుమతి, హైదరాబాద్‌లోని సుచిత్రలోని సెయింట్ ఆంధ్రా హైస్కూల్ విద్యార్థులు రిథిమాన్‌సింగ్, మయూర, అనన్యల ఆవిష్కరణకు తృతీయ బహుమతి లభించింది. మొదటి విజేతలకు రూ.20వేలు, ద్వితీయ విజేతలకు రూ.10 వేలు, తృతీయ బహుమతి విజేతలకు రూ.5 వేల చెక్కును ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అందజేశారు.

యాంటీ స్లీప్ డిటెక్టర్(మొదటి బహుమతి)

మేడ్చల్ జిల్లా బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థినులు నిహారిక, శివాంగి నాలుగు చక్రాల వాహనాలు నడిపే డ్రైవర్ల కోసం యాంటీ స్లీప్ డిటెక్టర్ తయారు చేశారు. కార్లు,లారీలు ఇతర భారీ వాహనాలను నడిపే డ్రైవర్లు భోజనం తర్వాత, రాత్రివేళల్లో వాహనం నడిపుతూ అకస్మాత్తుగా కునుకు తీస్తుంటూరు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణనష్టం జరుగుతుంది. డ్రైవర్లు నిద్రపోతే హెచ్చరించేలా విద్యార్థులు నిహారిక, శివాంగి యాంటీ స్లీప డిటెక్టర్ తయారు చేశారు. ఐ బ్లింక్ సెన్సార్ కళ్ల అద్దాలు, వెహికిల్ బ్రేకింగ్ సిస్టమ్ రిలే, ఫీజో బజర్ అలారమ్, ప్రోగ్రామింగ్ బోర్డుతో యాంటీ స్లీప్ డిటెక్టర్‌ను రూపొందించారు. వాహనం నడిపే డైవర్ ఐ బ్లింక్ సెన్సార్ అద్దాలు పెట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో నిద్రవస్తే వెంటనే అలారం వస్తుంది. దీంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై మేలుకుంటాడు. తద్వారా వాహనాల ప్రమాదాల జరగకుండా దోహదపడుతుంది. తాము రూపొందించిన యాంటీ స్లీప్ డిటెక్టర్ అద్దాలు డ్రైవర్లకు ఎంతో ఉపయోగకరమని, వీటిని వాడటం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని, తమ ఆవిష్కరణకు ఐఐటీహెచ్ మొదటి బహుమతి ఇవ్వడంపై విద్యార్థులు నిహారిక, శివాంగి హర్షం వ్యక్తం చేశారు.

డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ (ద్వితీయ బహుమతి)..

రామాంతపూర్‌లోని హెచ్‌పీఎస్ స్కూల్ విద్యార్థులు స్వాతికేష్, లక్ష్య థియేటర్లు, దవాఖానలు, షాపింగ్ మాల్స్‌లో ఉష్ణోగ్రతల హెచ్చు,తగ్గులను నియంత్రించడం, ఎయిర్ కండీషనర్ల ద్వారా ఉత్పత్తి అయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్‌ను తగ్గించేందుకు వీలుగా డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ యంత్రాన్ని రూపొందించారు. ఇవి ఉష్ణోగ్రతలను తగ్గించి చల్లటి గాలివచ్చేలా ఎయిర్ కండిషనర్లు, కూలింగ్ యూనిట్లు పనిచేసేందుకు వీలుగా డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు అధునాతన సెన్సర్లు బిగించారు. ఈ సెన్సర్లు పూర్తిగా ఉష్ణోగ్రతలను నియంత్రించడంతో పాటు జనానికి అవసరమైన మేర చల్లదనం వచ్చేలా డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ సిస్టం పనిచేస్తుంది. తమ ఆవిష్కరణకు ఐఐటీహెచ్ ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్‌లో బహుమతి దక్కడంపై విద్యార్థులు స్వాతికేష్, లక్ష్య హర్షం వ్యక్తం చేశారు.

మొదటి బహుమతి పొందిన బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థినులు నిహారిక, శివాంగి

విద్యార్థుల ఆవిష్కరణలు తిలకిస్తున్న ఐఐటీహెచ్ సిబ్బంది

మైక్రోఆల్గే ఫర్ సస్టెయినబుల్ ఎయిర్ ప్యూరిఫికేషన్

హైదరాబాద్ సుచిత్రలోని సెయింట్ ఆంధ్రా హైస్కూల్ విద్యార్థులు రిథిమాన్‌సింగ్, మయూర, అనన్య కలిసి మైక్రోఆల్గే ఫర్ సస్టెయినబుల్ ఎయిర్ ప్యూరిఫికేషన్‌ను తయారు చేశారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమ తదితర కారణాలతో గృహాల్లో అంతర్గత వాయు కాలుష్యం పెరుగుతుంది. గృహాల్లో అంతర్గత వాయు కాలుష్యం తగ్గించి గాలి శుద్ధి చేసేందుకు వీలుగా మైక్రోఆల్గే ఫర్ సస్టెయినబుల్ ఎయిర్ ప్యూరిఫికేషన్‌ను యంత్రాన్ని వీరు రూపొందించారు. రెండు ట్యాంకులుగా ఉండే ఈ యంత్రంలో ఒకరకమైన సూక్ష్మ ఆల్గే రూపొందించి స్థిరంగా గాలిని శుద్ధి చేస్తుంది. తమ ఆవిష్కరణకు తృతీయ బహుమతి రావడంపై రిథిమాన్‌సింగ్, మయూర, అనన్య హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

విగ్రహ ప్రతిష్ఠలో తుమ్మల పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, ఆగస్టు 18: మున్సిపల్ పరిధిలోని దుర్గాభవాని నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వినాయక స్వామి, సుబ్రహ్మణేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేదమంత్రోచ్చరణల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి దంపతులు, తుమ్మల ప్రసన్నాప్రతాప్ రెడ్డి, నల్ల సరిత సత్యనారాయణ రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, సీనియర్ నాయకులు కోల్లూరు యాదగిరి, నల్ల మాధవ రెడ్డి, కొండకల్ల శ్రీనివాస్, ఏళ్లకొండ మహేందర్, నల్ల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతుల పేరుతో కరెంటు కోతలు!

హత్నూర, ఆగస్టు 18: ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు జారీచేసినా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో కరెంట్ సరిగా ఉండడం లేదని హత్నూర గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడుపడితే అప్పుడు కరెంటు కోతలు విధిస్తున్నారని వాపోతున్నారు. వారం రోజులుగా కోతలు విధిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎందుకు కరెంట్ పోతున్నదని విద్యుత్ అధికారులు, సిబ్బందిని ప్రశ్నిస్తే మరమ్మతులు చేస్తున్నామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదోఒక మరమ్మతు పేరు చెబుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నారని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

వీరభద్రస్వామి సన్నిధిలో జడ్జి పూజలు

గుమ్మడిదల, ఆగస్టు 18: ప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో హైదరాబాద్ స్మాల్ కాస్ కోర్టు న్యాయమూర్తి, వరంగల్ జిల్లా మేజిస్ట్రేట్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో హైదరాబాద్ స్మాల్ కాస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు, వరంగల్ జిల్లా మెజిస్ట్రేట్ నందికొండ రీతిక స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనలు అందజేశారు. ఈవో శశిధర్‌గుప్తా, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యల ఆధ్వర్యంలో వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఐదు గుళ్ల పోచమ్మ బోనాలు



ఆర్సీపురంలో అమ్మవారికి దర్శించుకున్న ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు18: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బోనాల సందర్భంగా అమ్మవారి ఆలయానికి రంగులు వేసి సుందరంగా ముస్తాబుచేశారు. విద్యుత్ లైట్లతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఐదుగుళ్ల పోచమ్మ ఉత్సవాల్లో ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అమ్మవారిని దర్శించుకున్నారు. భారతీనగర్‌లోని బొంబాయికాలనీలో ఉన్న నల్ల పోచమ్మను ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నర్సింహ దర్శించుకున్నారు. రాత్రి పలు యువజన సంఘాలు అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరికె సత్యారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య, కుమార్‌గౌడ్, ఐలేశ్, మలేశ్, రాకేశ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

బోనాలకు విరాళం

గుమ్మడిదల, ఆగస్టు 18: పోచమ్మతల్లి బోనాలకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు విరాళం అందజేశారు. ఆదివారం మండలంలోని వీరారెడ్డిపల్లి పరిధిలోని మొల్లగూడెంలో నిర్వహిస్తున్న పోచమ్మ బోనాలకు గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రూ.10 వేలు ఆలయ కమిటీ చైర్మన్ శామంతుల బాలరాజు ముదిరాజ్‌కు అందజేశారు.

డాక్టర్ హత్య హృదయాలను కలిచివేసింది

తెల్లాపూర్‌లో క్యాండిల్ ర్యాలీ

రామచంద్రాపురం, ఆగస్టు 18: డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచార ఘటన ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేసిందని మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కాలనీ నుంచి ఇంద్రానగర్‌కాలనీ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిమ బెంగాల్‌లో ఓ వైద్యురాలిపై జరిగిన ఘటన అమానుషమని, నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలికి న్యాయం జరిగేలా దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరామ్ డిమాండ్ చేశారు.

రోడ్డు మరమ్మతులకు నిధులివ్వాలి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జిన్నారం, ఆగస్టు 18: మండలంలోని శివనగర్ గ్రామం నుంచి పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల చౌరస్తా వరకు ప్రధాన రహదారిని బాగు చేసేందుకు నిధులు కేటాయించాలని గ్రామ నాయకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, నాయకులు మహేశ్, సత్యనారాయణ, కృష్ణ, ఫహీం, మహేశ్‌గౌడ్, నర్సింలు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో నిర్మించిన రహదారి వర్షాల కారణంగా గుంతలు తేలి అధ్వానంగా తయారైందని వివరించారు. రోడ్డు గుంతలు తేలడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు.

ఘనంగా శ్రావణమాస బోనాలు

జిన్నారం, ఆగస్టు 18: మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో ఆదివారం శ్రావణమాస బోనాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల బోనాల పండుగలో మొదటి రోజు పోచమ్మ ఆలయానికి ఖాజీపల్లి, గొల్లగూడెం గ్రామ మహిళలు బోనాలతో పోతురాజుల ఆటలు, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనం సమర్పించారు. సోమవారం పెద్దమ్మ తల్లి బోనాలు నిర్వహించనున్నారు. బోనాలు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. తాజా మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నాయకులకు సన్మానం

సన్మానిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

బొల్లారం, ఆగస్టు 18: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఆర్సీపురంలో కార్పొరేటర్ పుష్పానగేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్పొరేటర్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని కార్పొరేటర్ సన్మానించారు. కార్యక్రమంలో యువజన నాయకులు రాకేశ్‌యాదవ్, రవితేజ, లఖాన్, శ్రీరామ్ తివారీ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

అమీన్‌పూర్, ఆగస్టు 18: ప్రభుత్వ భూములను కాపాడాలని అమీన్‌పూర్ మాజీ వార్డు సభ్యులు లింగంగౌడ్, పట్లోళ్ల భాస్కర్ రెడ్డి తహసీల్దార్ రాధకు వినతిపత్రం ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 783, 767లో ప్రభుత్వ భూమిలో సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని కోరారు. బీరంగూడలో శంభునిగుడి స్థలం సర్వే నంబరు 783లో 20 గుంటలు, 767లోని 3 గుంటలను కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని తెలిపారు. దీనిపై తహసీల్దార్ రాధ స్పందిస్తూ.. ప్రభుత్వ భూములపై విచారణ చేయిస్తామని తెలిపారు.

బైకును ఢీకొన్న బస్సు: మహిళ మృతి

కోహీర్, ఆగస్టు 18: చర్చిలో ప్రార్థనకు బైక్‌పై వెళ్తున్న మహిళను బస్సు ఢీకొట్టడంతో మృతిచెందింది. ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన మేస్త్రీబాబు తన టీవీఎస్ స్టార్ సిటీపై మొగిలిగారి సువర్ణ(76)తో ఆదివారం ఉదయం చర్చికి బయలుదేరాడు. అల్లీపూర్ దర్గా సమీపంలో 65వ జాతీయ రహదారి గుండా చర్చి వైపునకు వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు కిందపడిపోయారు. సువర్ణ తలపై నుంచి ఓ టైరు వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. ఆమె కుమారుడు భూషణ్‌దీపక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

కోహీర్, ఆగస్టు 18: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వేడుకలను పురస్కరించుకొని శివుడి విగ్రహానికి, ఉత్సవ విగ్రహాలకు లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడి పేరున సహస్ర నామాలను పఠిస్తూ స్వామివారికి బిల్వ పత్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి

బలహీన వర్గాల్లో చైతన్యం, వారి అభ్యున్నతికి పాటుపడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కల్లు గీత కార్మిక సంఘం, గౌడ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని నెమరువేసుకున్నారు. ఆయన అడుగుజాడల్లో హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన విగ్రహాల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 18

సంగారెడ్డి: నివాళులర్పించిన గౌడ సంఘం నాయకులు

అమీన్‌పూర్: నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, నాయకులు

సదాశివపేట: నివాళులర్పిస్తున్న నాయకులు



హత్నూర: దేవులపల్లిలో గౌడకులస్తుల నివాళి

వట్‌పల్లి: గౌడ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పిస్త